సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం । 31 । జనవరి । 2025



కుంభమేళాకు ప్రత్యేక బస్సులు
ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు ఏలూరు డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు. 8లో ▸



నాచుపువ్వుతో తంటా
దాళ్వా వరి చేలల్లో పెరుగుతున్న నాచుపువ్వు సంకటంగా మారింది. తొలగింపునకు రైతులు పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. 8లో ▸



మఠంగూడెంలో దారుణ హత్య
అనుమానం పెనుభూతమై భార్యను భర్త కిరాతకంగా హతమార్చిన ఘటన లింగపాలెం మండలం మఠంగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. 8లో ▸

న్యూస్‌రీల్

రథసప్తమి ఉత్సవాలు ప్రారంభం



చంద్రప్రభ వాహనంపై స్వామివారు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి రథసప్తమి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి 7 గంటలకు స్వామివారు పెళ్లి కుమారుడు అలంకరణలో చంద్రప్రభ వాహనంపై కొలువుదీరగా గ్రామోత్సవం నిర్వహించారు. విజయవాడకు చెందిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈఓ సాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి ఆలయ ధర్మకర్త, నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో నిత్య కల్యాణం జరిపించారు. ప్రతాప్ అప్పారావు పట్టువస్త్రాలు సమర్పించి ఉభయ దా తగా వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెనుగొండకు సీఎం చంద్రబాబు రాక

సాక్షి, భీమవరం: సీఎం చంద్రబాబు శుక్రవారం పెనుగొండకు రానున్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా అమ్మవారి ఆలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొంటారు. జిల్లాలో దాదాపు గంటపాటు సాగే సీఎం పర్యటన షెడ్యూల్‌ను గురువారం సీఎంఓ విడుదల చేసింది. ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.15 గంటలకు ఆలయానికి చేరుకుంటారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ, వాసవీ శాంతిథామ్‌లో పూజల అనంతరం 12.20కి ఉండవల్లికి తిరుగు పయనమవుతారు. సీఎం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పరిశీలించారు.

అవి పులి కూనలు కాదు



అడవి పిల్లి కూన

ఆగిరిపల్లి: మండలంలోని కృష్ణవరంలో ఫణి అనే రైతు పొగాకు తోటలో కనిపించిన పిల్లలు పులి కూనలు కాదని, అడవి పిల్లి కూనలను అటవీ శాఖ సిబ్బంది నిర్ధారించారు. గురువారం ఉదయం ఫణి తోటకు నీరు పెడుతుండగా వీటిని గుర్తించారు. గ్రామస్తులకు చెప్పడంతో వీటిని చూసి పులి పిల్లలను భావించి ఆందోళన చెందారు. అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ బాల ఇక్కడకు వచ్చి అవి అడవి పిల్లి కూనలుగా నిర్ధారించారు. అడవి పిల్లి శరీరం మీద చారలు భిన్నంగా ఉంటాయని, వాటికి పొడవైన తోక ఉంటుంది అని బాల తెలిపారు. కొన్నిరోజుల క్రితం ఈ ప్రాంతానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత ఉచ్చులో చిక్కుకుని చనిపోయింది. ఇటీవల మేకల మందపై పులి దాడి చేసింది. ఈ సంఘటనల నేపథ్యంలో సగ్గూరు, కృష్ణవరం, సురవరం, కొమ్మూరు గ్రామాల ప్రజలు అడవి పిల్ల పిల్లలను పులి కూనలు భావించి ఆందోళన చెందారు.

కోడ్ కూసింది



విగ్రహానికి ముసుగులు వేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియామవళి అమలులోకి రావడంతో ఎంపీడీఓ రాజ్ మనోజ్ ఆదేశాలతో పంచాయతీ అధికారుల కోడ్ అమలుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. మండలంలో 120కి పైగా ఫ్లెక్సీలను తొలగించారు. 44 విగ్రహాలకు ముసుగులు వేశారు.

వంతుల వరీ

రబీ సీజన్ ఆరంభంలోనే రైతులకు సాగునీటి కష్టాలు మొదలవుతున్నాయి. గోదావరిలో నీటి లభ్యత తక్కువగా ఉండటంతో శివారు భూముల్లో సాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. నీటి ఎద్దడిని అధిగమించేందుకు వంతుల వారీ విధానాన్ని ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలు చేసేందుకు ఇరిగేషన్ అధికారులు నిర్ణయించారు.



దాళ్వాకు నీటి గండం

- గోదావరిలో తగ్గుతున్న లభ్యత
- రేపటి నుంచి వంతుల వారీ విధానం అమలు
- 11 ప్రధాన కాలువలకు రెండు వంతులుగా సరఫరా
- జిల్లాలో 2.22 లక్షల ఎకరాల్లో రబీ సాగు
- 85 శాతం విస్తీర్ణంలో పూర్తయిన నాట్లు

సాక్షి, భీమవరం: జిల్లాలోని 2.22 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరగనుంది. ఖరీఫ్‌లో భారీ వర్షాలు, వరదలతో రైతులు నష్టాలు చవిచూశారు. ప్రభుత్వం నుంచి భరోసా దక్కక దాళ్వా పెట్టుబడులు పెట్టేందుకు సొమ్ములు లేక సాగు ఆలస్యమైంది. ఇప్పటివరకు 1.75 లక్షల ఎకరాల్లో నాట్లు పడగా ఇంకా 45 వేల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉందని అంచనా. జిల్లాలో రబీ సాగుకు దాదాపు 30 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 4.22 టీఎంసీలు నీరు అవసరం. గోదావరి సగటు నీటి లభ్యత, సీలేరు పవర్ డ్రాఫ్ట్ నుంచి వచ్చే జలాలు, పోలవరం ప్రాజెక్టు డెస్ట్ లెవిల్ నిల్వలను లెక్కగట్టి రబీ పూర్తి ఆయకట్టుకు అనుమతివ్వడంతో రైతులు సాగు చేపట్టారు. జిల్లాలోని బ్యాంక్ కాలువ, నరసాపురం, అత్తిలి, జీఅండ్‌వీ, ఉండి, కాకరపర్రు తదితర కాలువల ద్వారా ఆయకట్టుకు సాగునీటి సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం పలు శివారు భూములకు సాగునీరు సరిగా అందని పరిస్థితి ఎదురవుతుండటం రైతులను కలవరపరుస్తోంది. నీటి ఎద్దడిని అధిగమించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు వచ్చేనెల 1 నుంచి వంతుల వారీ విధానం ద్వారా పూర్తి ఆయకట్టుకు నీటిని సర్దుబాటు చేసేందుకు నిర్ణయించారు. గత దాళ్వా సీజన్లలో వంతుల వారీ విధానం ద్వారా పూర్తి ఆయకట్టుకు నీరందించామని అధికారులు తెలిపారు.

వంతుల వారీ షెడ్యూల్

జిల్లాలో 11 ప్రధాన పంట కాలువల ద్వారా సాగు, తాగునీటి సరఫరా జరుగుతోంది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు వంతుల వారీ విధానం (టర్న్ సిస్టం) అమలుకు జిల్లా నీటిపారుదల శాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఒక్కో వంతు ఆరు రోజుల చొప్పున రెండు వంతులుగా ఈ విధానాన్ని అమలు చేయనున్నట్టు ప్రకటించింది.

- **మొదటి వంతుగా..** నరసాపురం కాలువ పెరవలి లాకు నుంచి కవిటం లాకు వరకు, బ్యాంక్ కాలువ సిద్దాంతం లాకు నుంచి లక్ష్మీపాలెం లాకు వరకు ఇరగవరం, పెరవలి, పెనుగొండ, ఆచంట, పాలకొల్లు, పోడూరు, పెనుమంట్ర, వీరవాసరం, యలమంచిలి, నరసాపురం, మొగల్తూరు మండలాలకు చెందిన 75,256 ఆయకట్టు సాగవుతోంది. వీటికి ఫిబ్రవరి 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 7వ తేదీ ఉదయం 6 గంటల వరకు, అలాగే 14వ తేదీ నుంచి 20 వరకు, 27వ తేదీ నుంచి మార్చి 5 వరకు, మార్చి 12వ తేదీ నుంచి 18 వరకు, మార్చి 25వ తేదీ నుంచి 31 వరకు సాగునీటిని సరఫరా చేస్తారు.
- **రెండో వంతుగా..** కాకరపర్రు లాకు నుంచి పెరవలి లాకు వరకు, బ్యాంక్ కాలువ 23 కి.మీ నుంచి సిద్దాంతం లాకు వరకు, నరసాపురం కాలువ కవిటం లాకు నుంచి మొగల్తూరు లాకు వరకు ఉండ్రాజవరం, తణుకు, పెరవలి, ఇరగవరం, పెనుగొండ, ఆచంట, పాలకొల్లు, పోడూరు, నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల పరిధిలో 81,574 ఆయకట్టు సాగవుతోంది. ఈ పొలాలకు ఫిబ్రవరి 7వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 13న సాయంత్రం 6 గంటల వరకు, అలాగే 20వ తేదీ నుంచి 26 వరకు, మార్చి 5వ తేదీ నుంచి 11 వరకు, 18వ తేదీ నుంచి 24 వరకు, మార్చి 31వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు సాగునీటిని విడుదల చేస్తారు.

నీటి ఎద్దడి రానివ్వం



గోదావరిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున జిల్లాలో ఎక్కడా సాగు నీటి సమస్య రాకుండా ఫిబ్రవరి 1 నుంచి వంతుల వారీ విధానాన్ని అమలు చేయనున్నాం. శివారు భూములకు పూర్తిస్థాయిలో నీటిని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పుడు ఏ కాలువకు నీరు విడుదల చేసేది రైతులకు తెలిసేలా ఏర్పాట్లు చేశాం. వంతుల వారీ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని మంచి దిగుబడులు సాధించాలి.

– నాగార్జునరావు, ఎస్ఈ, ఇరిగేషన్ శాఖ

69,884 మంది పట్టభద్రుల ఓటర్లు

కలెక్టర్ నాగరాణి



భీమవరం (ప్రకాశం చౌక్): తూర్పు–పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఏలూరు కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు. ఎన్నికల నిర్వహణపై గురువారం అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆమె ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని, రూట్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులను నియమించి, వారికి శిక్షణ ఇస్తామన్నారు. తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్‌లను ఆర్డీఓలు గుర్తించాలన్నారు. వాహనాలు, బ్యాలెట్ బాక్స్‌ల కోసం ఇండెంట్ పెట్టాలన్నారు. జిల్లాలో 93 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, 20 మండలాల్లో 69,884 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని చెప్పారు. వీరిలో 39,780 మంది పురుషులు కాగా, 30,103 మంది మహిళా ఓటర్లు, ఒక ట్రాన్స్ జెండర్ ఉన్నారని చెప్పారు. ఫారం–18లో గ్రాడ్యుయేట్ల పేర్లను చేర్చడానికి దరఖాస్తులను ఫిబ్రవరి 10 వరకు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలకు వచ్చే నెల 3న నోటిఫికేషన్ విడుదల చేస్తారని పేర్కొన్నారు. 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, 11న స్క్రూటినీ, 13న ఉపసంహరణకు అవకాశం ఉందని తెలిపారు. ఫిబ్రవరి 27న పోలింగ్ ఉంటుందన్నారు. మార్చి 3న కౌంటింగ్ చేపడతారని కలెక్టర్ నాగరాణి తెలిపారు.

అగ్నిమాపక శకటం కేటాయింపు



భీమడోలులో అగ్నిమాపక శకటం

సాక్షి స్పందన

భీమడోలు: భీమడోలు అగ్నిమాపక కేంద్రానికి ఉన్నతాధికారులు అగ్నిమాపక శకటాన్ని కేటాయించారు. ఈనెల 24న 'మూలనపడ్డ అగ్నిమాపక శకటం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఏలూరు అగ్నిమాపక కేంద్రం నుంచి తాత్కాలికంగా శకటాన్ని భీమడోలు ఫైర్‌స్టేషన్‌కు కేటాయించారు.

చెత్త రిక్షాలకు మరమ్మతులు

కైకలూరు: 'స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలకు తూట్లు' శీర్షికను ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పాత ఎంపీడీఓ క్వార్టర్స్ వద్ద పడి ఉన్న చెత్త సేకరణ రిక్షాలకు గురువారం మరమ్మతులు చేయించారు. ఆరు రిక్షాలను చెత్త సేకరణకు వినియోగిస్తామని ఆటపాక సర్పంచ్ తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌కు 89 మంది హాజరు

భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాలలో నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారం ముగిశాయి. ఉదయం జరిగిన పరీక్షల్లో 100 మంది విద్యార్థులకు గాను 89 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

ఇంత నమ్మక ద్రోహమా?

సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి కారుమూరి ధ్వజం



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: సూపర్ సిక్స్ పేరుతో సంక్షేమం అందిస్తానని గత ఎన్నికల్లో చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారని, ఆడిన మాట తప్పటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ కోసం ప్రజలు ఎదురుచూస్తున్న వేళ ఇవ్వలేని పరిస్థితి ఉందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం దుర్మార్గమన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకొనే చంద్రబాబు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసుకోలేక సూపర్ సిక్స్ హామీలిచ్చారా అని మండిపడ్డారు. సంపద సృష్టిస్తానని చెప్పి ఇప్పుడు ఇవ్వలేననడం రేవు దాటాక తెప్ప తగలెయ్యడం కాదా అని నిలదీశారు. నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. అంటూ రాష్ట్రమంతా ఒక మంత్రంలా ఊదరగొట్టి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. నేడు ఆ రూ.15 వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి ఏమయ్యాయని నిలదీశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా అవే హామీలు ఇచ్చారని, ఆయన ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం క్యాలెండర్ రూపంలో సంక్షేమాన్ని బటన్ నొక్కి అందించారని గుర్తుచేశారు. మూలనున్న ముసలమ్మ కూడా బటన్ నొక్కగలదని ఎద్దేవా చేసిన చంద్రబాబు.. నేడు ఆ బటన్ నొక్కి సూపర్ సిక్స్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ఆ విషయాన్ని ప్రజలే నిలదీస్తారని హెచ్చరించారు. సంక్షేమం ఇవ్వకపోగా ప్రజలపై ఇష్టానుసారం భారాలు వేస్తున్నారని, విద్యుత్ సర్దుబాట్ల పేరుతో రూ.15 వేల కోట్ల భారాలు వేశారని, తాజాగా భూముల రిజిస్ట్రేషన్ ఫీజులను పెంచి ఖజానాను నింపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో రోడ్లకు టోల్ పెట్టి ప్రజల రక్తమాంసాలు జుర్రుకుందామని కార్యాచరణ చేస్తున్నారంటూ చంద్రబాబుపై ధ్వజమెత్తారు. రాష్ట్ర ఖజానా నుంచి కోట్లు ఖర్చు చేసి దావోస్ వెళ్లి ఏం పెట్టుబడులు తెచ్చావని సీఎం చంద్రబాబును నిలదీశారు. గత 30 ఏళ్లుగా పింఛను తీసుకుంటున్న వారిపై పింఛను వెరిఫికేషన్ పేరుతో తొలగింపునకు శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. 50 శాతం పింఛన్లను తొలగించేందుకు చంద్రబాబు కుట్ర పన్నారని కారుమూరి దుయ్యబట్టారు.

చంద్రబాబు దగాకోరు



మాట్లాడుతున్న ఉమాబాల

భీమవరం: ఎన్నికల్లో సూపర్ సిక్స్‌పై ఆర్భాటంగా ప్రచారం చేసి అధికారంలోనికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయా పథకాలు అమలుచేయలేక చేతులెత్తేయడం ఆయన దగాకోరుతనానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల, జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు తీవ్రంగా ధ్వజమెత్తారు. గురువారం భీమవరంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన ఏడు నెలల్లోనే భారీగా అప్పులు చేయడంతో పాటు విద్యుత్ చార్జీలు రూ.15 వేల కోట్లు పెంచారని, తాజాగా భూముల రిజిస్ట్రేషన్ల విలువ పెంపుతో ప్రజలపై భారీగా భారం వేశారని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించలేని అసమర్థపాలనతో ముందుకు వెళుతున్నారన్నారు. మాజీ సీఎం జగన్ తన ఐదేళ్ల పాలనలో పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని, కరోనా విపత్తు సమయంలోనూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా ఏ ఒక్క పథకాన్నీ ఆపలేదని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో మంచం మీద ఉన్న ముసలమ్మ బటన్ నొక్కుతుందన్న చంద్రబాబు ఇప్పుడు ఎందుకు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. పథకాలు అమలు చేయలేమని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించడంతో ప్రజలంతా ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టి విద్యేనని మరోసారి రుజువుచేశారని ఎద్దేవాచేశారు. కూటమి పార్టీలు ఎన్నికల హామీలను అమలు చేసేవరకూ ప్రజాపక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని ఉమాబాల స్పష్టం చేశారు.

నయవంచనలో దిట్ట



పీవీఎల్ నరసింహరాజు, ఉండి ఇన్‌చార్జి

కాళ్ల: ప్రజలను నమ్మించి మోసం చేయడంలో సీఎం చంద్రబాబు సిద్ధహస్తులని, మరోసారి ప్రజలు ఆయన చేతిల్లో మోసపోయారని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు అన్నారు. పెద అమిరం లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అరచేతిలో వైకుంఠం చూపించి ప్రజలను నట్టేట ముంచారని ఎద్దేవా చేశారు. హామీలను అమలుచేయలేమని స్వయంగా ప్రకటించి దగాచేశారని విమర్శించారు. అధికారం కోసం హామీలు ఇవ్వడం, గద్దెనెక్కిన తర్వాత ఎదుటివారిపై నిందలు మోపడం ఆయన నైజమన్నారు. అప్పుల విషయంలోనూ చంద్రబాబు అబద్దాలు చెబుతున్నారన్నారు. వలంటీర్లను తొలగించడం, గ్రామ, వార్డు సచివాలయాల్లో పోస్టులను కుదించడం నిజం కాదా అని నిలదీశారు. జగన్ తీసుకువచ్చిన 17 మెడికల్ కళాశాలలను చంద్రబాబు తన మనుషులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుండటం వాస్తవం కాదా అని అడిగారు. ఇసుక, మద్యం మాఫియాలతో కూటమి నాయకులు జేబులు నింపుతున్నారని ఆరోపించారు. చంద్రబాబు సంపద సృష్టి వట్టి మాటలేనని అన్నారు. హామీలు నెరవేర్చలేక ఆ నెపాన్ని జగన్‌పై వేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు.

చింతమనేనీ.. ఇదేం పని!

- జనసేన నేతపై చింతమనేని అనుచరుల దాడి
- దుగ్గిరాలలో చెరుకు లోడును అడ్డుకుంటున్న వైనం
- ఏలూరులో పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుల ధర్నా



ఏలూరు త్రీటౌన్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న జనసేన నాయకులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: చింతమనేని అనుచరులు మళ్లీ రెచ్చిపోయారు. ఈసారి జనసేన శ్రేణులపై దాడికి దిగారు. బాధితులు స్టేషన్‌కు వచ్చి కేసు పెట్టినా పోలీసులు పట్టించుకోకపోవడంతో జనసేన నాయకులు పోలీస్‌స్టేషన్ ఎదుటే ధర్నాకు దిగడం చర్చనీయాంశంగా మారింది. దెందులూరు నియోజకవర్గంలో జనసేన మండల అధ్యక్షుడికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మర్రి శివరామకృష్ణ, బాధితుడు నూజివీడు మండల జనసేన అధ్యక్షుడు యర్రంశెట్టి రాము, నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. స్టేషన్ బయట గేటు వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు.

నూజివీడు మండల అధ్యక్షుడిపై దాడి

మీర్జాపురం గ్రామానికి చెందిన రాము దెందులూరు నియోజకవర్గంలోని దుగ్గిరాలలో చెరుకు తోట సాగు చేస్తున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో ఈ ప్రాంతంలోని సుమారు 100 ఎకరాలు నీటమునగుతుంది. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వటంతో ఇవి చెరువు భూములు కాదనీ, పట్టా భూములను నిర్ధారించారని బాధితుడు రాము చెబుతున్నారు. తాను నాలుగు ఎకరాల్లో చెరుకు వేశాననీ, సుమారు రూ.6 లక్షలు ఖర్చు చేశానని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తనపై వేధింపులు పెచ్చుమీరాయని, తనపై చింతమనేని ఏలూరు త్రీటౌన్ స్టేషన్‌లో తప్పుడు కేసు పెట్టించారని వాపోయారు. ఐదు నెలలుగా తాను పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. మంత్రి లోకేష్ ప్రజాదర్బార్‌లోనూ రైతుల ఇబ్బందులపై వినతి చేశామనీ, ఏలూరు కలెక్టర్‌కు సైతం తమ సమస్యలు చెప్పామన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 28న తాను తోటలో చెరుకు నరికించి లోడు చేస్తుండగా ఎమ్మెల్యే చింతమనేని అనుచరులు 50 మంది తనపై దాడి చేస్తూ అత్యంత దారుణంగా దుర్భాషలాడుతూ రెండు సెల్‌ఫోన్లు లాక్కున్నారని వాపోయారు.

ఎమ్మెల్యేలకు అహంకారం పెరిగింది

ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధికార ప్రతినిధి మర్రి శివరామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చింతమనేని అరాచకాలు పెరిగిపోయాయనీ, చింతమనేనికి సంబంధం లేకుండా ఆయన అనుచరులు చెరుకు తోటలోకి వెళ్లి ఎందుకు దాడి చేశారో చెప్పాలని అన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు కొందరికి గర్వం తలకెక్కిందనీ, అహంకారం పెరిగి అరాచకాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇలానే దాడులు, దౌర్జన్యాలు చేస్తే ఊరుకోబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళతామని, వెంటనే కేసు నమోదు చేసి చింతమనేని అనుచరులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

మహిళలపై దాడులు ఎమ్మెల్యేకు పట్టవా?

మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: మీకు ఓట్లేసిన మహిళలను రౌడీలతో కొట్టిస్తూ తణుకులో అరాచక పాలన సాగుతుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మీకు ఓట్లేసిన పాపానికి మహిళలను రోడ్డెక్కించారు.. కళ్ల నీళ్లు తెప్పించారు.. నేడు కొట్టించారు.. ఇంత జరుగుతుంటే ఎమ్మెల్యే ఎందుకు నిమ్మకునీరెత్తినట్టు ఉన్నారో ప్రజలకు తెలియాలన్నారు. ప్రజలు ఓట్లేయలేదా మీరు యంత్రాలతో గెలిచారనుకుంటున్నారా అని నిలదీశారు. ప్రజలే రోడ్డెక్కి పశు వ్యాన్‌లను పట్టిస్తుంటే ఎమ్మెల్యేగా ఏంచేస్తున్నారని, పశు వధ ఫ్యాక్టరీకి అనుమతులు అక్రమమని తేలినా ఎందుకు స్పందించలేదని అన్నారు. పశువధ ఫ్యాక్టరీ వ్యవహారంలో భారీగా డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలతో ప్రజలు రోడ్డెక్కారని అన్నారు. మీకు ఆ రక్తం కూడే అవసరమా.. డబ్బే ముఖ్యమా.. బాధిత కుటుంబాలు ఇంట్లో ఉండలేక, అన్నం తినలేక ఇబ్బందులు పడుతుంటే ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. గతంలో స్థానికులు పశువధ ఫ్యాక్టరీని వ్యతిరేకించిన వెంటనే తాను ఆపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా మీ అధికారాన్ని ఉపయోగించి పశువధ శాలను వెంటనే ఆపించకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఆడబిడ్డల ఉసురు పోసుకోవద్దన్నారు. పాలిచ్చే గేదెలను కోసేస్తున్నారని, ఇటీవల ఆంబోతును కూడా తెచ్చారని తెలిసిందని, ఆంబోతులను వధించడం తణుకుకే అరిష్టం అని అన్నారు. సెంటు భూమి కూడా లేకుండా తేతలిలో అక్రమంగా నిర్వహిస్తున్న వారికి మద్దతిస్తారా, వారితో మహిళలను కొట్టించడం భావ్యమా అని కారుమూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ లీగల్ టీం సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఇరగవరం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, నాయకులు వి.సీతారాం, పుల్లెపు సూర్యచంద్రరావు, యడ్లపల్లి సురేంద్ర పాల్గొన్నారు.

కలెక్టరేట్ స్థల మార్పుపై నేడు రౌండ్ టేబుల్ సమావేశం

భీమవరం: భీమవరంలో కలెక్టరేట్ స్థల మార్పుపై శుక్రవారం జిల్లాస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు భీమవరం చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తామని, వామపక్షాలు, రాజకీయ పార్టీలు, అభ్యుదయవాదులు, ప్రజాతంత్రవాదులు, దళిత, గిరిజన ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, మేధావులు, ప్రగతిశీల వాదులు పాల్గొంటారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

వర్జీనియా రైతులకు అవగాహన సదస్సు

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు రైతులకు గురువారం బయ్యన్నగూడెం, కొయ్యలగూడెం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారిని గ్రేసీ మార్గరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పురుగు మందుల అవశేషాలు కలిగి ఉండటం వలన నాణ్యమైన పొగాకు ఉత్పత్తి ధర పతనమవుతుందని అధికారులు వివరించారు. గుంటూరు నుంచి వచ్చిన పొగాకు బోర్డు విస్తరణ అధికారి దామోదర్, సీటీఆర్ఐ సైంటిస్ట్ వి.వెంకటేశ్వర్లు పురుగు మందులు ఉపయోగించిన పొగాకుకు, సేంద్రియంగా పండించిన పొగాకుకు మధ్య వ్యత్యాసాలను ప్రదర్శిస్తూ రైతుల్లో అవగాహన కల్పించారు. అనంతరం కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రంలో ఎస్ఎల్ఎస్ పరిధిలో ఐదు ఆక్షన్ ప్లాట్‌ఫారాలకు సంబంధించిన రైతు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఐటీసీ లీఫ్ మేనేజర్ ఎం.కొత్రిషి, పీఎస్ఎస్ లీఫ్ మేనేజర్ ఎ.సురేంద్ర, జీపీఐ సీనియర్ మేనేజర్ పునీత్, డాక్టర్ ఉమ మహేష్ (సైంటిస్ట్) పాల్గొన్నారు.

కాపాడి.. కౌన్సెలింగ్ ఇచ్చి..

ఏలూరు టౌన్: రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు కాపాడారు. టూ టౌన్ ఎస్సై దానం తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని నాగేంద్ర కాలనీ ప్రాంతానికి చెందిన నర్ర గోపి స్థానికంగా నూనె దుకాణంలో పనిచేస్తూ భార్యతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో రూ.3 లక్షలు అప్పు చేసి సొంత వ్యాపారం ప్రారంభించాడు. వ్యాపారం సజావుగా సాగకపోవటంతో అప్పులు చెల్లించలేక గురువారం ఏలూరు టూ టౌన్ పరిధిలో రైలు కిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన స్థానికులు వెంటనే ఏలూరు పోలీస్ కంట్రోల్ రూమ్ 112కు సమాచారం ఇచ్చారు. టూటౌన్ ఎస్సై దానం, కానిస్టేబుల్ సుందర్ రాజు హుటాహుటిన అక్కడకు చేరుకుని గోపిని రక్షించారు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ముగిసిన స్పోర్ట్స్ మీట్

విశాఖ స్పోర్ట్స్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్(విశాఖ) కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన స్పోర్ట్స్ మీట్ పోటీలు గురువారంతో ముగిశాయి. స్టేట్ అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో 13 రీజియన్లకు చెందిన పాలిటెక్నిక్ కళాశాలల జట్లు పోటీపడగా చిత్తూరు, కృష్ణా రీజియన్ జట్లు ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌కు పోటీపడ్డాయి. బాలుర ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాయిగణపతి పాలిటెక్నిక్, గిడిజాల(విశాఖ రీజియన్), బాలికల ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, భీమునిపట్నం(విశాఖ రీజియన్) జట్లు కైవసం చేసుకున్నాయి.

లైసెన్స్ లేని ఎరువులు సీజ్

కైకలూరు: విక్రయ లైసెన్సులు లేని రూ.29 వేల విలువ కలిగిన బయో స్టిమ్యులెంట్స్ అనే ఎరువులను కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు గురువారం సీజ్ చేశారు. వింజరం గ్రామంలో శివ నాగ దుర్గా ట్రేడర్స్ నుంచి రశీదులు లేకుండా ఎరువులు విక్రయిస్తున్నట్లు వ్యవసాయాధికారులకు సమాచారం అందింది. దీంతో మండల వ్యవసాయాధికారిణి ఆర్.దివ్యతో కలసి దుకాణాన్ని తనిఖీ చేశారు. యజమాని సుబ్రహ్మణ్యం నుంచి వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. లైసెన్సులు లేని ఎరువులు దుకాణం బయట కనుగొన్నారు. అనంతరం ఏడీ మాట్లాడుతూ శివ నాగ దుర్గా ట్రేడర్స్‌కు కేవలం పురుగు మందులు విక్రయించే లైసెన్సు మాత్రమే ఉందన్నారు. ఎరువుల విక్రయాలకు అనుమతులు లేవన్నారు. రైతులకు ఎరువులు విక్రయించి రశీదులు ఇవ్వకుండా ఖాతా పుస్తకంలో పేర్లు నమోదు చేశాడన్నారు. శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు.

నాచుపువ్వుతో తంటా

- దాళ్వా వరిచేలల్లో విస్తరిస్తున్న నాచుపువ్వు
- ఎరువులు భూమికి చేరడం లేదని రైతుల ఆందోళన
- నాచుపువ్వు తొలగింపు అదనపు భారంగా మారిందని ఆవేదన



పాలకోడేరు మండలంలోని వరిచేనులో విస్తరించిన నాచుపువ్వు



పెనుమంట్ర మండలం పొలమూరులోని వరిచేనులో నాచుపువ్వు

భీమవరం: దాళ్వా వరిచేలలో విచ్చలవిడిగా పెరుగుతున్న నాచుపువ్వు రైతులకు సంకటంగా మారింది. నీటి ద్వారా వచ్చే నాచుపువ్వు నాట్లు వేసిన పొలాల్లో విస్తారంగా వ్యాపించడంతో రైతులు దానిని తొలగించడానికి తీవ్ర ఇబ్బందులకు గురికావడమేగాక పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత దాళ్వా సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో 2.25 లక్షల ఎకరాల్లో వరిసాగుచేయాల్సి ఉండగా దాదాపు 95 శాతానికిపైగా నాట్లు పూర్తయ్యాయి. ముందుగా నాట్లువేసిన ప్రాంతంలో మొదటి విడత ఎరువులు వేయడం పూర్తిచేసి కలుపుతీసే పనిలో నిమగ్నమయ్యారు. కొంత ఆలస్యంగా నాట్లు వేసిన భూముల్లో నాచుపువ్వు పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాచుపువ్వు భూమి మొత్తం వ్యాప్తి చెందడంతో కూలీలతో తొలగించడానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. నాచుపువ్వు కారణంగా పైరుకు వేసే ఎరువులు, గుళికలు వంటివి భూమికి చేరకుండా పువ్వులపై ఉండడంతో ఎరువులు వేసినా ప్రయోజనం లేకుండా పోతుందని వాపోతున్నారు. నాచుపువ్వు దట్టంగా అలుముకోవడం, త్వరితగతిన విస్తరించడం వల్ల భూమిలోని సారాన్నికూడా గ్రహించడం వల్ల వరిపైరు ఎదుగుదల లోపిస్తోందని రైతులు చెబుతున్నారు. కాలువల్లోని నీటి ద్వారా వచ్చే నాచుపువ్వు నివారణకు ప్రభుత్వ పరంగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరిచేలలో కలుపుతోపాటు నాచుపువ్వు కూలీలతో తొలగించడానికి ఎకరాకు రూ.4 వేల వరకు ఖర్చు అవుతోందని, ఒకసారి తొలగించే సమయంలో ఎక్కడైనా చిన్న పువ్వు మిగిలినా అది మరింత విస్తరిస్తోందని రైతులు చెబుతున్నారు.

నివారణ చర్యలు ఇలా

వరిచేలలో నాచుపువ్వు (ఫిస్టియా) నివారణకు టుపార్టీ సోడియం సాల్ట్ మందును పిచికారీ చేయాలని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ ఎన్ మల్లిఖార్జునరావు చెప్పారు. రెండు గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పువ్వు పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలన్నారు. మందును పిచికారీ చేసే సమయంలో ఇతర కూరగాయలు వంటి మొక్కలకు తగలకుండా చర్యలు తీసుకోవాలని, మొక్కలకు మందు తగిలితే అవికూడా చనిపోయే ప్రమాదముందన్నారు. నాచుపువ్వు నీటి ద్వారా వస్తున్నందున కాలువల నుంచి చేలలోనికి నీరు వచ్చే ప్రాంతంలో నెట్ వంటిది ఏర్పాటు చేసుకుంటే నాచుపువ్వు చేలలోనికి రాకుండా అడ్డుకోవచ్చునన్నారు.

మతంగగూడెంలో దారుణహత్య

- కొడవలితో భార్యను హత్య చేసిన భర్త
- నిందితుడు పరారీ
- హత్యకు దారితీసిన అనుమానం



మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకన్న

లింగపాలెం: రక్తపు మడుగులో ఓ మహిళ మృతి చెందడం లింగపాలెం మండలం మతంగగూడెంలో సంచలనం రేకెత్తించింది. గ్రామానికి చెందిన జక్కంపూడి నాగమణి (45) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ప్రతిరోజూ పనులకు వెళ్లే విధంగానే తోటి కూలీలు ఆమెను పనికి రమ్మని పిలవడానికి వెళ్లగా.. ఇంట్లో రక్తపు మడుగుల్లో నాగమణి పడి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. చింతలపూడి సీఐ ఎం.రవీంద్ర, ధర్మాజీగూడెం ఎస్సై కే వెంకన్న హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరిస్తున్నారు.

అనుమానమే.. పెనుభూతమై

జక్కంపూడి మారేష్, నాగమణి భార్యాభర్తలు. వీరికి ఒక కుమారుడు కుమార్తె సంతానం కాగా వారిద్దరికి వివాహాలై వేరే చోట నివసిస్తున్నారు. కాగా మారేష్ మద్యానికి బానిస కావడంతో నాగమణిని ఇబ్బందులకు గురిచేసేవాడు. దీంతో వీరిద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో గొడవలను సర్దుబాటు చేశారు. అయితే మారేష్ ఇటీవల మద్యం సేవించి మతిస్థిమితం లేనివాడిలా ప్రవర్తించేవాడని స్థానికులు చెబుతున్నారు. ఇదే క్రమంలో గురువారం రాత్రి భార్య నాగమణిని కత్తితో నరికి చంపివేసి పరారీ అయ్యాడు. చింతలపూడి సీఐ రవీంద్ర పర్యవేక్షణలో ధర్మాజీగూడెం ఎస్సై కే. వెంకన్న ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ చెప్పారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం- జంగారెడ్డిగూడెం జాతీయ ప్రధాన రహదారిపై ఓల్డ్ ఏజ్ హోమ్ సమీపంలోని కోత మిషన్ వద్ద గురువారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఎస్సై వి చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన సాధు భక్తవత్సల కుమార్ (63) జంగారెడ్డిగూడెం వైపు వెళుతుండగా వెనక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు కుమారుడు జోసఫ్ కులకర్ణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

భారీ కోడిపందేల శిబిరంపై దాడి

- 9 మంది అరెస్ట్.. 40 బైకులు, నగదు స్వాధీనం
- పారిపోయిన నిర్వాహకులు, టీడీపీ శ్రేణులు



లోపూడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న బరి



కోడిపందేల్లో పట్టుబడిన బైక్‌లను ట్రాక్టర్లలో తరలిస్తున్న పోలీసులు

ముసునూరు: అధికారం అండతో లోపూడిలో అర్ధరాత్రి యథేచ్ఛగా నిర్వహిస్తున్న భారీ కోడి పందేల శిబిరంపై పోలీసులు మెరుపు దాడిచేశారు. ఈ దాడిలో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకోగా, వారివద్ద నుంచి రూ.42,400, 40 బైకులు, 12 కోడి పుంజులు, నాలుగు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. వివరాల ప్రకారం.. లోపూడిలోని ఓ మామిడి తోటలో బుధవారం రాత్రి అతి రహస్యంగా జరుగుతున్న కోడి పందేలపై ముసునూరు ఎస్సై చిరంజీవి, చాట్రాయి ఎస్సై రామకృష్ణ, సిబ్బందితో కలసి ముప్పేట దాడి చేశారు. గ్రామానికి చెందిన, పందేల నిర్వాహకులైన అధికార పార్టీ శ్రేణులు పారిపోగా, తొమ్మిది మందిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పోలీసుల దాడి సమయానికి తోటలో ఉన్న వందలాది జూదరులు బరి చుట్టుపక్కల ఉన్న పొగాకు, మొక్కజొన్న, మిర్చి తోటలను తొక్కుకుంటూ పారిపోవడంతో పంటలు పాడయ్యాయని సమీప రైతులు ఆవేదన చెందుతున్నారు. మరికొందరు చెక్కపల్లి వైపు పారిపోతూ ఉండగా కారు పల్టీకొట్టి అందులోని వారు గాయాలపాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారం అండగా అదే తోటలో సంక్రాంతి అనంతరం నిత్యం కోడి పందేలు నిర్వహిస్తూ, ఇతర జిల్లాల నుంచి కూడా పందెంరాయుళ్లను రప్పిస్తున్నట్లుగా తెలుస్తోంది. పారిపోయిన టీడీపీ శ్రేణులు నిర్వాహకులను సైతం అరెస్టు చేయాలని పలువురు కోరుతున్నారు. పట్టుబడిన వారిని శుక్రవారం కోర్టుకు తరలిస్తామని పోలీసులు చెప్పారు.

కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించాలనుకునే జిల్లాకు చెందిన భక్తుల సౌకర్యార్థం ఏలూరు డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉంచామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు డిపో నుంచి ఫిబ్రవరి 4వ తేదీన ఈ బస్సులు బయలుదేరుతాయని, రిజర్వేషన్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ బస్సులు ఏలూరులో బయలుదేరి పూరి, కోణార్క్, భువనేశ్వర్, ప్రయాగ రాజ్ సంగమ స్థానం, కాశీ, అయోధ్య, గయా, బుద్ధగయ, తిరుగు ప్రయాణంలో ఆంధ్ర రాష్ట్రంలో ప్రఖ్యాతి గాంచిన అరసవెల్లి సూర్య దేవాలయం, శ్రీకూర్మం దర్శనం అనంతరం ఏలూరు చేరుకుంటుందన్నారు. మొత్తం ఎనిమిది రోజులు జరిగే ఈ యాత్రలో రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణికులకు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ యాత్ర మొత్తం ఖర్చు రు.12500గా నిర్ణయించామన్నారు. వివరాలకు తమ పీఆర్ఓను 93467 67670లో సంప్రదించవచ్చన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏలూరుకి సమీపంలోని బలివే పుణ్య క్షేత్రానికి ఏలూరు, నూజివీడు డిపోల నుంచి 60 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని, పట్టిసీమకి జంగారెడ్డిగూడెం నుంచి 30 బస్సులు, తాడేపల్లిగూడెం నుంచి 20 బస్సులు, తాడేపల్లిగూడెం వద్ద ఉన్న వీరంపాలెంకు తాడేపల్లిగూడెం నుంచి 10 బస్సులు, ఏలూరు నుంచి 4 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఫిబ్రవరి 7, 8 తేదీల్లో జరిగే అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవానికి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 50 బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇటీవల సంక్రాంతి పండగ సందర్భంగా హైదరాబాద్‌కి 572 స్పెషల్ బస్సులు తిప్పామని, వాటిద్వారా రూ.1.14 కోట్ల ఆదాయం జిల్లా ఆర్టీసీకి వచ్చిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే రూ.పది లక్షలు ఎక్కువ ఆదాయం వచ్చిందని ఆర్టీసీ బస్సులు ఎంచుకొని ప్రయాణించిన ప్రతి ప్రయాణికుడికి ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో ఏలూరు డిపో మేనేజర్ బీ వాణి, ఏఎంటీ జీ మురళి, పీఆర్వో కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు.

కొల్లేరులో మిగులు భూములను పేదలకు పంచాలి

ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్



మాట్లాడుతున్న ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ కుమార్

ఏలూరు (టూటౌన్) : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కొల్లేరులోని ఆక్రమణలు తొలగించడం ఆహ్వానించదగ్గదే అని, ఇదే క్రమంలో కొల్లేరులో మిగులు భూములను స్థానిక పేదలకు పంపిణీ చేయాలని ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్ఆర్ పేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు కొల్లేరులో 15,336 ఎకరాలు ఆక్రమణలు ఉన్నట్లు నివేదిక ఇచ్చారన్నారు. తాజాగా సుప్రీంకోర్టు కొల్లేరులోని స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి ఎటువంటి భంగం కలుగకుండా ఆక్రమణలు మూడు నెలల్లో తొలగించాలంటూ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఇదే సమయంలో కొల్లేరు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే ప్రభుత్వం ఎటువంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టకుండా సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అక్రమ చెరువులను ధ్వంసం చేస్తామంటూ ప్రకటనలు చేయడం వల్ల కొల్లేరు ప్రజల్లో అయోమయం నెలకొందన్నారు. సుప్రీంకోర్టు విధి విధానాల ప్రకారం కొల్లేరు ప్రజలకు అవగాహన కల్పించి అనంతరం ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఇదే క్రమంలో కొల్లేరులో మిగులు భూములను స్థానిక ఎస్సీ, బీసీలకు పంపిణీ చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాము మాన్‌సింగ్, దాసరి శ్యాం, బొల్లారపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దూడలకు అందాల పోటీలు



కనకాయలంకలో పెయ్య దూడల అందాల పోటీల్లో పాల్గొన్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు

యలమంచిలి: కనకాయలంకలో గురువారం నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరంలో లేగ పెయ్య దూడలకు అందాల పోటీలు నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ పి మురళీకృష్ణ, భీమవరం ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ జవార్ హుస్సేన్, పాలకొల్లు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ గంజనబోయిన మల్లేశ్వరరావు, యలమంచిలి మండల పశువైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఈ పోటీల్లో పాల్గొన్న దూడలను పరిశీలించారు. ఈ పోటీలకు కనకాయలంక, పెదలంక గ్రామాలకు చెందిన రైతులు 35 పెయ్య దూడలను తీసుకువచ్చారు. వాటిలో కడలి సత్యనారాయణకు చెందిన పుంగనూరు ఆవు దూడకు మొదటి బహుమతి, యాతం సత్యనారాయణకు చెందిన గేదె దూడకి రెండవ బహుమతి, గెద్దాడ చిట్టిబాబుకి చెందిన గేదె దూడకి మూడవ బహుమతి వచ్చాయి. ఈ రైతులకు జిల్లా అధికారులు బహుమతులు అందజేశారు. అనంతరం పశు వైద్య శిబిరంలో 44 పశువులకి వైద్య పరీక్షలు, 282 పశువులకు పాముల మందులు, 300 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు, బొబ్బ వ్యాధి రాకుండా టీకాలు, 282 కోళ్లకు కొక్కెర వ్యాధి రాకుండా టీకాలు వేశారు.

హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ జీ.శ్యాం కుమార్

దెందులూరు: గోపన్నపాలెం పంచాయతీ వేగవరం హేలాపురి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ ఆవరణలో గురువారం జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో అంతర్ కళాశాల హ్యాండ్‌బాల్ బాలికల – బాలుర విభాగాల్లో టోర్నమెంట్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జేఎన్‌టీయూ కాకినాడ డాక్టర్ జి శ్యాం కుమార్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలైన తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల నుంచి బాలుర విభాగంలో 11 జట్లు, బాలికల విభాగానికి సుమారుగా 10 జట్లు ఎంపిక ట్రైల్స్‌లో పాల్గొన్నారు. ఈ పోటీలు శుక్రవారం కూడా కొనసాగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.లావణ్య, ఏఓ కరుణానిధి తెలిపారు. వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానియేలు, డీఎస్‌డీఓ బీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోటీలు

మొదటి మ్యాచ్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాలికల విభాగంలో గుంటూరు జిల్లా సెయింట్ మేరీస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ వర్సెస్ సర్ సీఆర్ రెడ్డి ఏలూరు, బాలుర భాగంలో వీఆర్ సిద్ధార్థ వర్సెస్ మాచర్ల న్యూటన్స్ కాలేజీ తలపడ్డాయి. బాలుర విభాగంలో గుడ్లవల్లేరు ఎస్ఆర్‌జీసీ వర్సెస్ పీవీసీ సిద్ధార్థ టీమ్ తలపడ్డాయి. బాలుర విభాగంలో రామచంద్ర కాలేజ్ వర్సెస్ జేఎన్‌టీయూ కాకినాడ జట్టు, బాలుర విభాగంలో పీఎస్ సీఎంఆర్ కాలేజ్ వర్సెస్ ఒంగోలు పేస్ కాలేజ్ జట్లు మొదటి రోజు తలపడ్డాయి.

భవిష్యత్ కృత్రిమ మేధస్సుదే

వరంగల్ నిట్ ఆచార్యులు వెంకటకృష్ణ



విద్యార్థులతో మాట్లాడుతున్న వరంగల్ నిట్ ఆచార్యులు వెంకటకృష్ణ

తాడేపల్లిగూడెం : భవిష్యత్ అంతా కృత్రిమ మేధస్సుదేనని వరంగల్ నిట్ సీఎస్ఈ విభాగం ఆచార్యులు డాక్టర్ వెంకటకృష్ణ అన్నారు. ఏపీ నిట్‌లో ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెంటర్ సహకారంతో జనరేటివ్ ఏఐ అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. వెంకటకృష్ణ మాట్లాడుతూ కొత్త కొత్త సాంకేతికతలు ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు ఆవిష్కృతమవుతున్నాయన్నారు. సంస్థలు, పరిశ్రమలు, కంపెనీలలో పలు రంగాలలో కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞాన వినియోగం రోజురోజుకు పెరుగుతుందన్నారు. దానికి తగ్గట్టుగానే ఉద్యోగావకాశాలు పుట్టుకొస్తున్నాయన్నారు. విద్యార్థులు వాటిని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఏపీ నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, మిషన్ లెర్నింగ్ వంటి నూతన సాంకేతికతలపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. సమాజహిత అవసరాలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. కృత్రిమ మేధస్సు ప్రాధాన్యత, ఉద్యోగ అవకాశాలు వంటి విషయాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీఫణికృష్ణ అధ్యక్షత వహించారు. ఆచార్యులు కార్తికేయ శర్మ, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ నగేష్‌భట్టు తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో చోరీలు

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి చోరీలు సంభవించాయి. స్థానిక పాతూరులో మిద్దే వరప్రసాద్ నివాసం ఉంటున్నారు. వీరి కుటుంబ సభ్యులు ఇటీవల బెంగుళూరు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బీరువాలోని 4 కాసుల బంగారు ఆభరణాలు, రూ.80 వేల నగదును అపహరించారు. గురువారం ఉదయం తలుపులు తీసి ఉండటాన్ని గమనించిన స్థానికులు వరప్రసాద్‌కు సమాచారం అందించారు. దీంతోపాటు స్థానిక ఎఫ్‌సీఐ గోదాముల సమీపంలోని గృహంలో ఓ వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉంటోంది. ఇది గమనించిన కొందరు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వృద్ధురాలు కేకలు వేయడంతో వారు పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

జంగారెడ్డిగూడెం: గ్రామాలను ఖాళీ చేయించి భూములు ఇచ్చిన గిరిజనులకు పరిహారం ఇచ్చాకే ప్రాజెక్టు పూర్తి చేయాలని పోలవరం నిర్వాసితుల యాత్ర బృందం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రంపచోడవరం జిల్లాలో ప్రారంభమైన నిర్వాసితుల యాత్ర గురువారం జంగారెడ్డిగూడెం చేరుకుంది. స్థానిక బస్టాండ్ సెంటర్లో ఈ యాత్ర బృందానికి సీపీఎం జంగారెడ్డిగూడెం మండల, పట్టణ కమిటీలు ఘన స్వాగతం పలికాయి. అనంతరం బస్టాండ్ సెంటర్లో నిర్వాసితుల యాత్ర రాష్ట్ర నాయకులు కామ్రేడ్ దడాల సుబ్బారావు లోత రామారావు మాట్లాడుతూ లక్షల కోట్ల రూపాయల నిధులను ప్రాజెక్టు కట్టడానికి వెచ్చిస్తున్నారే తప్ప, భూమిలిచ్చి గ్రామాలు ఖాళీ చేసిన నిర్వాసితులకు గిరిజనులకు పరిహారం ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. సీపీఎం పార్టీ రాష్ట్ర 27వ మహాసభలు నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరుగుతున్నాయని, ఈ మహాసభల్లో పోలవరం నిర్వాసితుల సమస్యలపై చర్చించి తగు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ రవి కిషోర్ నాగమణి, యాత్ర బృందం, మండల కార్యదర్శి ఎం జీవరత్నం పట్టణ కన్వీనర్ పి సూర్యారావు, పాల్గొన్నారు.

కుక్కునూరుకు చేరిన యాత్ర

కుక్కునూరు: పోలవరం నిర్వాసితుల పోరాట పతాక జీపు యాత్ర గురువారం కుక్కునూరుకు చేరింది. ఈ సందర్భంగా రామసింగారం సెంటర్లో జాతనుద్దేశించి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు మాట్లాడారు. కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయల దోచిపెట్టేలా ప్రాజెక్టు నిర్మాణం పై ఉన్న శ్రద్ధ ప్రభుత్వాలకు నిర్వాసితులకు చెల్లించే పునరావాస పరిహారంపై లేకపోవడం సరి కాదన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం ప్రతి నిర్వాసితుడికి రూ.15 లక్షలు పునరావాస పరిహారం ఇవ్వాలని నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించే వరకు ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిపి వేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ రవి మాట్లాడుతూ 2022 గోదావరి వరదలను ప్రామాణికంగా తీసుకొని మండలం యూనిట్ గా తీసుకోని ప్రతి నిర్వాసితుడికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు వై నాగేంద్రరావు, పోలవరం మండల నాయకులు తాటి శాంతకుమారి ఎం వీరాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రానికి ఐరన్‌ర్యాక్‌ల బహూకరణ



బల్లిపాడు ఆరోగ్యకేంద్రానికి ఐరన్ ర్యాక్‌లు బహూకరించిన దృశ్యం

అత్తిలి: పిఠాపురం శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో బల్లిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ దండు పద్మావతి సహకారంతో రెండు ఐరన్ ర్యాక్‌లు, బరువుతూచే మిషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా దాత పద్మావతిని ఆరోగ్య కేంద్ర సిబ్బంది అభినందించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేట చిన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఐదు రోడ్లుకు అభిముఖంగా పంచముఖ ఆంజనేయస్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఈ సమారాధనకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరై పూజలు జరిపారు. అన్నసమారాధనను ప్రారంభించారు. రూ. లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.మనోహర్, ఎ.పానకాలు, ఎ.గిరి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యలమర్తి రాజేశ్వరీదేవి మృతికి కారుమూరి సంతాపం



తణుకులో రాజేశ్వరీదేవి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీమంత్రి కారుమూరి

తణుకు అర్బన్: మాజీ ఎమ్మెల్యే వైటీరాజా తల్లి, పారిశ్రామికవేత్త యలమర్తి నారాయణ రావుచౌదరి సతీమణి యలమర్తి రాజేశ్వరీదేవి మృతికి మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం తణుకులోని వైటీ రాజా నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజేశ్వరిదేవి అల్లుడు దగ్గుపాటి సురేష్, వైటీరాజా కుమారుడు యలమర్తి అవినాష్‌తో పాటు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఈవోపీఆర్‌డీ వెంకటేష్‌కు సన్మానం



కొండ్రుప్రోలు సచివాలయంలో ఈవోపీఆర్‌డీ వెంకటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్‌ను గురువారం మండలంలోని కొండ్రుప్రోలు సచివాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు పంచాయతీల విస్తరణకు వెంకటేష్ చేసిన సేవలను కొనియాడారు. కూటమి నాయకులు ఉప్పలపాటి బాబూరావు, సురేష్, నాగరాజు, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ ఎం.రవికిరణ్, వల్లీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న మానవత సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. పచ్చా వెంకటేశ్వర రావు, తిరుమళ్ళ పాండురంగారావు, చెకూరి బంగ్రారాజు, వై.ఆంజనేయస్వామి, వై.శరత్ బాబు, కొడూరి రాధా పుష్పవతి, బోయపాటి రామలక్ష్మి, రామకృష్ణ పాల్గొన్నారు.

బాదుడే బాదుడు

- భూముల ధరలకు రెక్కలు
- ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలు
- గూడెంలో కనీసం గజం ధర రూ.11వేలు, గరిష్ఠం రూ. 70 వేలు

తాడేపల్లిగూడెం: పట్టణంలో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి. భూముల విలువను పెంచడానికి ప్రభుత్వం పలు కసరత్తులు చేసిన అనంతరం అనామలిస్ కమిటీ పలు వడపోతలు, సమావేశాల తర్వాత జనవరి ఒకటోతేదీ నుంచి పెరగాల్సిన భూముల విలువలు ఫ్రిబ్రవరి ఒకటోతేదీ నుంచి పెరుగుతున్నాయి. ఈమేరకు జిల్లాకు సంబంధించి అధికారిక ఆమోద ముద్ర పడింది. పలు గ్రామాలు పట్టణాల్లో భూముల విలువలు వాస్తవిక పరిస్థితికి భిన్నంగా ఉన్నాయి. భూముల విలువ కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ మాదిరి బుక్ విలువగాఉంది. దీంతో రిజిస్ట్రేషన్ల సమ యంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితులను బట్టి క్షేత్రస్థాయిలో వాస్తవికత ఆధారంగా భూముల విలువను నిర్ధేశిస్తూ అనామలిస్ కమిటీలోని అధికారుల బృందం నిర్ణయం తీసుకొంది. ఈమేరకు పెరిగిన కొత్త విలువల ధరలు రిజిస్ట్రేషన్ నిమిత్తం ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నాయి.

గూడెంలో కనిష్టం గజం రూ.11వేలు

గూడెం పట్టణంలో ఉన్న 35 వార్డుల్లో కొన్ని ప్రాంతాలు మినహా మిగతా భూముల విలువను పెంచారు. గతంలో గజం ఆరువేల రూపాయలు యాగర్లపల్లి వంటి ప్రాంతంలో ఉండేది. భూముల విలువ మదింపు సమయంలో ఈ విలువను గతంలో రెండుసార్లు పెంచారు. ప్రస్తుతం అక్కడ గజం పదివేల



రూపాయలుంది. ఈ విలును ఫిబ్రవరి ఒకటి నుంచి 11వేల రూపాయలకు పెంచారు. పట్టణ నడిబొడ్డుగా ఉన్న తాలూకా ఆఫీస్ ప్రాంతం, రైల్వే స్టేషన్ ప్రాంతం, భూపాల్ నగర్ ఏరియాల్లో గతంలో గజం విలువ 65 వేల రూపాయలుంది. ప్రస్తుతం ఆ విలువను 70 వేల రూపాయలకు పెంచారు. వెంకట్రామన్నగూడెం గ్రామంలో గజం రెండు వేల రూపాయలున్న భూమి విలువను 2,500కు పెంచారు. కుంచనపల్లిలో స్థలాలను బట్టి గజం భూమి విలువను రూ.2,500 రూపాయల నుంచి రూ.3,000 నుంచి నాలుగు వేల రూపాయలకు పెంచారు. వ్యవసాయ భూముల విలువ విషయానికొస్తే ఎకరం కనీసం రూ.72 లక్షల నుంచి రూ.80 లక్షలకు పెరిగింది. రూ.80 లక్షలున్న భూమి విలువ రూ.90 లక్షలకు పెంచారు. ఈ పెరిగిన ధరలు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తాయి.

బాపూజీ బాట విశ్వశాంతికి స్ఫూర్తి

తణుకు అర్బన్: శాంతియుత పోరాటం ద్వారా బ్రిటీషు వారి నుంచి స్వాతంత్ర్యం సాధించిన మహాత్ముడు గాంధీజీ అని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మహాత్మాగాంధీజీ 77వ వర్ధంతి సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా భారతదేశం నలుమూలల తిరిగి ప్రజా చైతన్యం తీసుకువచ్చిన గాంధీజీని ఆదర్శంగా తీసుకుని యువత నడుచుకోవాలని పిలుపునిచ్చారు. అహింసకు తావులేకుండా బ్రిటీషువారిని గడగడలాడించిన వ్యక్తిగా గాంధీమహాత్ముడు చరిత్రలో నిలిచారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఇరగవరం మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షురాలు షేక్ ఫహీమా, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, వీరమల్లు ఫణీంద్రకుమార్, యడ్లపల్లి సురేంద్ర, న్యాయవాది చోడే గోపికృష్ణ, పైబోయిన ఏసుబాబు, గెద్దాడ శ్రీకాంత్, బొద్దాని శ్రీనివాస్, చింతాడ సంజీవరావు, కొఠారు రామాంజనేయులు, రాచమళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

మహాత్మా గాంధీజీ జీవితం మానవాళికి మార్గదర్శకమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని గాంధీజీ విగ్రహానికి పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తణుకు పట్టణ అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, నాయకులు పెన్మత్స సోమసుందర సత్యనారాయణరాజు, రాసాబత్తుల అనుకుమార్, కరాసు శివప్రసాద్, కసిరెడ్డి మణిదీప్, బడేటి సాయిరాం, గంటా లక్ష్మి, పెద్దమల్లు సుబ్రహ్మణ్యం, గుడివాడ రామయ్య, ఆత్మూరి రామకృష్ణ, మారిశెట్టి అజయ్, పులమాల వీరభద్రం, శ్రీను, బాల, త్రినాథ్ పాల్గొన్నారు.



తణుకు అర్బన్: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు



తణుకు అర్బన్: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు శ్రీదేవి, నాగరాజు తదితరులు



తాడేపల్లిగూడెం(టీఓసీ): గాంధీకి నివాళులర్పిస్తున్న మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు



పెంటపాడు: పరిమెళ్ల జెడ్పీస్కూల్లో మూర్తిరాజు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గాంధీ చూపిన మార్గం అనుసరణీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహాత్మాగాంధీ చూపిన మార్గం అనుసరణీయం మహాత్మా గాంధీ మండపం అభివృద్ధి ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. గాంధీ మండపంలో గురువారం గాంధీ 77వ వర్ధంతిని నిర్వహించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు, ట్రస్ట్ అధ్యక్షుడు ఆరాధ్యుల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి దుర్గా రామచంద్రరావు, బీజేపీ నాయకులు కర్రి ప్రభాకర్ బాలాజీ, లయన్ గట్టిం మాణిక్యాలరావు, చామన సూర్యచంద్రరావు, మల్లుల విజయ్, కె.బాలకృష్ణ, వి.బుజ్జి, పి.రాము, నల్లగంచు రాంబాబు, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు. వాకర్స్ ఆధ్వర్యంలో...

ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అధ్యక్షుడు తిరుమళ్ళ సూరిబాబు ఆధ్వర్యంలో వాకర్స్ భవనం వద్ద గాంధీ వర్ధంతిని నిర్వహించారు. పూర్వ అధ్యక్షుడు బీఐ రాజేంద్ర, దూలం నాగరాజు, కేవీ చలం, కోశాధికారి మల్లారెడ్డి సారధి, కొండబాబు, పి.శ్రీనివాస్, వంశీ, బాలాజీ, గురుమూర్తి, చిరంజీవి తదితరులు నివాళులర్పించారు.

మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో...

ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో కె.కనకదుర్గ, డి.వెంకటలక్ష్మి, ఆర్.ఉదయ్ కుమారి, కె.వెంకటలక్ష్మి, కె.రామలక్ష్మి, ఎం.చటమ్మ పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ వర్ధంతి

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో గురువారం గాంధీ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. పెంటపాడు మండల, తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో బాలాజీ అధ్యక్షతన గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను వివరించారు. పరిమెళ్ల గ్రామంలో సర్వోదయ నాయకులు ఇందుకూరి ప్రసాదరాజు, మానవత జిల్లా నాయకులు సాగి జానకిరామరాజుల ఆధ్వర్యంలో జెడ్పీస్కూల్ వ్యవస్థాపకులైన విద్యాదాత చింతలపాటి మూర్తిరాజు విగ్రహాన్ని ఆవిష్కరించారు. హెచ్ఎం కాంతిశ్రీ, విశ్రాంత ఎంఈవో ఏవీ రామరాజు, గ్రామ సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ ఇందుకూరి నాగరాజు, పేరెంట్ కమిటీ చైర్మన్ మోఖమాట్ల నాగదేవి, జనసేన నాయకులు సుంకర ఏసు, విగ్రహదాత కనుమూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కారుమూరి పరామర్శలు



రేలంగిలో భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

ఇరగవరం: ఇరగవరం మండలంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందిన కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. మండలంలోని గవర్లపాలెం గ్రామంలో ఇటీవల మరణించిన చదరం సూర్యారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే రేలంగి గ్రామంలో కొండపల్లి పుల్లలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పేకేరు గ్రామంలోని ఇటీవల మరణించిన కర్రి రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే రేలంగి గ్రామంలోని మానే భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మైనం పాము, సత్యనారాయణ, సురేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందంగా మెరిసే జిడ్డుగల చర్మం, చెవులు, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలు కుష్టు వ్యాధికి సంకేతాలని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని లెప్రసీ విభాగ వైద్యాధికారి డాక్టర్ చాముండేశ్వరి అన్నారు. మహాత్మా గాంధీజీ వర్ధంతి పురస్కరించుకుని నిర్వహించే స్పర్శ 2025 జాతీయ కుష్టు వ్యతిరేక దినోత్సవాన్ని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని లెప్రసీ విభాగంలో గురువారం జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరచేతులు, అరికాళ్లలో స్పర్శలేకపోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం వంటివి కూడా కుష్టు వ్యాధి లక్షణాలు కావచ్చని చెప్పారు. ఈ లక్షణాలు కల వారు వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని, ముందుగానే గమనిస్తే అంగవైకల్య జరగకుండా నివారించుకోవచ్చని స్పష్టం చేశారు. గురువారం నుంచి వచ్చేనెల 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రోగులకు పండ్లు, రొట్టెలు, పంపిణీ చేశారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జీవీవీఎస్ఎన్ మూర్తి, ఫిజియోథెరపిస్ట్ వి.వేణు, స్టాఫ్ నర్సులు కుమారి, బ్యూలా, రూప, సిబ్బంది, రోగులు పాల్గొన్నారు

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



తాడేపల్లిగూడెం రూరల్: పడాలలో పాడి రైతులకు ప్రొటీన్ ప్యాకెట్లు అందజేస్తున్న ఏడీ సునీల్ కుమార్



పెంటపాడు: ఆకుతీగపాడు గ్రామంలో పశువులకు టీకాలు వేస్తున్న సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు

తాడేపల్లిగూడెం రూరల్: పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వి. సునీల్ కుమార్ తెలిపారు. మండలంలోని పడాల గ్రామంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 109 పాడి పశువులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే.శ్రీనివాస్, పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, సువర్ణరాజు, వెంకటేష్, ప్రకాష్, పోసుబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకుతీగపాడులో పశువైద్యశిబిరం

పెంటపాడు: పశువుల వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి మహేష్, ఆకుతీగపాడు సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆకుతీగపాడు గ్రామంలో సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, మండల పశువైద్యాధికారి మహేష్‌ల ఆధ్వర్యంలో గ్రామంలోని 127 పశువులకు వైద్య పరీక్షలు చేశారు. మరికొన్నింటికీ గర్భకోశ వ్యాధులను పరీక్షించారు. రైతులకు మిక్చర్ ప్యాకెట్లు అందజేశారు. పశువుల పోషణకు సంబంధించిన పట్టికను రైతులకు అందజేశారు. సహాయ సంచాలకులు అనిల్‌కుమార్, బుద్దన ధనరాజు, పడాల ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిలో పశువైద్య శిబిరం

అత్తిలి: పాడి అభివృద్ధికి రైతులు కృషి చేయాలని జిల్లా జంతు సంక్షేమ సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్ కుమార్ కోరారు. గురువారం అత్తిలి మండలం పాలి గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఉచితంగా పశువులకు మందులు అందజేసారు. ఈ కార్యక్రమంలో బుద్దాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో సౌకర్యాల కల్పన



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-1 వి.హనుమ

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ముందస్తు ప్రణాళిక తయారు చేయడం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించబడతాయని ఎంఈవో-1 వి.హనుమ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ప్లానింగ్‌పై ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంఈవో-2 పీఎం కే.జ్యోతి మాట్లాడుతూ బడ్జెట్ ప్రణాళిక తయారు చేయడం ద్వారా విద్యా కార్యక్రమాలు అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరుకు దోహదపడుతుందన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సంఖ్య, పాఠశాలకు వస్తున్న విద్యార్థుల సంఖ్య సమానంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు టీఐఎస్, ఆన్‌లైన్‌లో శిక్షణ కోర్సులు, యు-డైస్, డ్రాప్ అవుట్స్, ఎండీఎం, శానిటేషన్, పరీక్షలు, మార్క్స్ నమోదు తదితర అంశాలపై చర్చించారు. ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన జేఈఈ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జాతీయ సాంకేతిక విద్యా సంస్థల్లో ప్రవేశాలకుగాను నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్షల్లో భాగంగా చివరి రోజు గురువారం శ్రీవాసవిలో ఇంజనీరింగ్ కళాశాలలో సాయంత్రం పరీక్షకు 224 మందికి 219 మంది పరీక్షకు హాజరయ్యారు. వివరాలను కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నకర్ వెల్లడించారు.

కేవీకేలో తేనెటీగల పెంపకంపై శిక్షణ

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని కృషీ విజ్ఞాన కేంద్రంలో వచ్చే నెలలో తేనెటీగల పెంపకంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు పత్రికా ప్రకటనలో గురువారం తెలిపారు.జాతీయ బీ బోర్డు వారి సహకారంతో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమంలో తేనెటీగల పెంపకం, తేనె సేకరణ, బైనం, మొదలగు అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు.

కల్లుగీత కార్మికుల మద్యం దుకాణాలకు నోటిఫికేషన్

తణుకు అర్బన్: తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పరిధిలో కల్లుగీత కులాలకు సంబంధించి 5 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలో శెట్టిబలిజ, తణుకు రూరల్‌లో శెట్టిబలిజ, ఇరగవరంలో గౌడ, పెనుమంట్రలో గౌడ, పెనుగొండలో శెట్టిబలిజ కులాలకు రిజర్వు చేసినట్లు చెప్పారు. ఒక వ్యక్తి జిల్లాలో ఎన్ని షాపులకైనా, ఎన్ని దరఖాస్తులైనా దాఖలు చేయవచ్చునని, ఒకవ్యక్తికి ఒక షాపు మాత్రమే కేటాయించబడుతుందని చెప్పారు. లాటరీలో ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ షాపులు తగిలిన పరిస్థితుల్లో అతను కోరిన షాపును మాత్రమే కేటాయించి మిగిలిన షాపులను ఇతరులకు కేటాయిస్తామని, అప్లికేషన్ ఫీజు రూ. 2లక్షలు నాన్ రిఫండబుల్‌గా నిర్దేశించినట్లు తెలిపారు. ఏవిధంగా దాఖలు చేయాలి, ఏ డాక్యుమెంట్లు అవసరం అని తదితర అంశాలకు సంబంధించి సందేహాల నివృత్తి కోసం శుక్రవారం సాయంత్రం 5 గంటలకు తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీపీఎం 27వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



తణుకులో పోస్టర్లు ఆవిష్కరించిన సీపీఎం నాయకులు ప్రతాప్, అజయకుమారి

తణుకు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో నిర్వహించనున్న సీపీఎం 27వ రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్ పోరాటాల రూపకల్పన జరుగుతుందని సీపీఎం జిల్లా కారదర్శివర్గ సభ్యులు పీవీ ప్రతాప్, పట్టణ ప్రధాన కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి అన్నారు. గురువారం స్థానిక అమర వీరుల భవనంలో సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలు అమలు చేయడానికి డబ్బులు లేవని చెప్పడం శోచనీయమని అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయింపులు చేయాలని, ప్యాకేజీల వలన ఎలాంటి ఉపయోగం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల ఆదాయాలు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ.15 వేల కోట్లు విద్యుత్ భారాలు ప్రజలపై మోపడం దారుణమని అన్నారు. ఈ కార్యక్రమంలో గుబ్బల గోపి, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక నార్త్‌లో 33/11కేవీ విద్యుత్ హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో మెయిన్ రోడ్డు ఫీడర్, రైల్వే ఫీడర్, కొండయ్యచెరువు ఫీడర్‌లకు సంబంధించి ఈ నెల 31వ తేదీన విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. మెయిన్ రోడ్డు, నల్లజర్ల రోడ్డు, పోలీస్ క్వార్టర్స్, శేషమహల్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి డౌన్, కోతిబొమ్మ సెంటర్, స్టేషన్ రోడ్డు, భూపాల్ నగర్, కొండయ్య చెరువు, రామారావుపేట, హంగ్రీ బర్డ్స్, కడకట్ల, ఉమెన్స్ కళాశాల పరిసర ప్రాంతాలకు చెందిన ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున పట్టణ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వల్లూరుపల్లిలో పౌరహక్కుల దినోత్సవం



వల్లూరుపల్లి సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

పెంటపాడు: వల్లూరుపల్లి సచివాలయం వద్ద గురువారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. పెంటపాడు తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ కుల వివక్షకు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గతం కన్నా జగనన్న సీఎం అయిన నాటి నుంచి ఎస్సీలకు ప్రత్యేక రక్షణ ఉందన్నారు. వారిపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించే చట్టం తేవడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దంగేటి రామస్వామి, పెంటపాడు సాంఘీ కసంక్షేమాధికారి, పరిమెళ్ల సోషల్‌వెల్ఫేర్ అధికారితో పాటు, గ్రామ రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): కలుషిత నీటిలో పుట్టే దోమల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు, వైద్యాధికారులు జే.రవికుమార్, తనూజా, శ్రావ్య, వన్యప్రియలు తెలిపారు. పట్టణంలో వీకర్స్‌కాలనీ, ఎన్‌టీఆర్ జంక్షన్, కడకట్ల, యాగర్లపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో గురువారం దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పలు వార్డుల్లో ఫైలేరియా వ్యాధిగ్రస్తులతో ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు.